కూరగాయల ధరలు



సనత్‌నగర్: టమాటా రూ.13, నల్లవంకాయ 23, పాడుగు వంకాయ 23, బెండకాయ 45, పచ్చిమిర్చి 55, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్ 65, పచ్చకాకర 38, పందిరి బీర 45, క్యాబేజీ 23, క్యారెట్ 19, దొండ 23, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 50, గోకరకాయ 40, కీర 23, దోసకాయ 18, బీట్‌రూట్ 17, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 21, చామగడ్డ 45, మొరంగడ్డ 18, కందగడ్డ 50, సొరకాయ 9, పొట్లకాయ 15, అరటికాయ 15, మునగకాయ 3–4, ముల్లంగి 4–5. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

నూతన గవర్నర్‌ను కలిసిన తలసాని

సనత్‌నగర్: తెలంగాణ రాష్ట్ర నూతన గవర్నర్ రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు. గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం మర్యాదపూర్వకంగా కలిశారు.

పోలీసుల వినూత్న ప్రయత్నం

- వేగ నియంత్రణకు సరికొత్త ఆలోచన
- బేగంపేట ఫ్లైఓవర్ మధ్య డివైడర్‌పై బొమ్మపోలీస్..
- గో స్లో అంటూ హెచ్చరిస్తూ వాహనదారులను అప్రమత్తం చేసేలా ఏర్పాటు





బేగంపేట ఫ్లైఓవర్ డివైడర్‌పై బొమ్మ పోలీస్‌ను ఆవిష్కరించిన నార్త్‌జోన్ ట్రాఫిక్ అధికారులు..

సనత్‌నగర్: బేగంపేట ఫ్లైఓవర్..ప్రమాదాలకు కేరాఫ్..అతివేగంగా దూసుకుపోయే క్రమంలో ఫ్లైఓవర్‌పై డివైడర్‌ను ఢీకొట్టిన సందర్భాలు అనేకం. ఈ నేపథ్యంలో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులను ఎప్పుడూ అప్రమత్తం చేసేవిధంగా నార్త్‌జోన్ ట్రాఫిక్ పోలీసులు వినూత్నంగా ఆలోచించారు. అచ్చం మనిషిని పోలిన బొమ్మను రూపొందించి ఆ బొమ్మ చేతిలో గో స్లో (నెమ్మదిగా వెళ్లండి) అని రాసి ఉన్న బోర్డును ఏర్పాటుచేశారు. అక్కడ ట్రాఫిక్ పోలీసే ఉండి విధులు నిర్వర్తిస్తూ వాహనదారులను హెచ్చరిస్తున్నట్లుగా బొమ్మ పోలీస్‌ను తీర్చిదిద్దారు. ఆ బొమ్మ పోలీస్‌ను చూసినప్పుడల్లా ఈ మార్గంలో వెళ్లే వాహనదారులు అప్రమత్తమై తాము వెళ్తున్న వేగాన్ని సరిచూసుకుని తగ్గిస్తారనే సదుద్దేశ్యంతో నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు దీని ఏర్పాటుకు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఇందుకు వరుణ్ మోటార్స్ సహకారాన్ని అందించింది. బేగంపేట ఫ్లైఓవర్ మధ్య డివైడర్‌పై ఏర్పాటు చేసిన ఈ బొమ్మ పోలీస్‌ను నార్త్‌జోన్ ట్రాఫిక్–1 కమిషనర్ ఎల్.సుబ్బారాయుడు, డీసీపీ రంగారావు, ఏసీపీ శంకర్‌రాజు, వరుణ్ మోటార్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్‌సీ రాజు, జనరల్ మేనేజర్ కృష్ణకుమార్, బ్రాంచ్ మేనేజర్ సుమంత్‌లు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ వాహనదారుల భద్రతే తమ ప్రథమ కర్తవ్యమన్నారు. వాహనదారులు కూడా తమపై ఆధారపడ్డ కుటుంబాన్ని దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలన్నారు. నిర్ణీత వేగంతో వెళితే అందరికీ సురక్షితమన్నారు. బేగంపేట ఫ్లైఓవర్‌పై జరుగుతున్న ప్రమాదాలను నివారించే లక్ష్యంగా ఎప్పుడూ అప్రమత్తం చేసేలా బొమ్మ పోలీస్‌ను ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. బొమ్మను చూసి వెంటనే వాహనదారులు తమ వేగాన్ని నియంత్రించుకోవాలని సూచించారు.

జీరా బస్తీ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి



బస్తీ సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కోట నీలిమ

బన్సీలాల్‌పేట్: జీరా బస్తీ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమ అన్నారు. బస్తీలో ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ కోట నీలిమ ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ఈ బస్తీ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటానన్నారు. పేద, బడుగు బలహీనవర్గాలు జీవనం సాగిస్తున్న ఈ సమస్యలో చాలా కాలం నుంచి సమస్యలు తిష్టివేసి ఉన్నా ఎవరూ కూడా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. జీరా బస్తీలో ఇళ్ల నిర్మాణానికి తనవంతు బాధ్యతగా కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున్, హేమంత్ సింగ్, శ్రీకాంత్‌చారిపాల్గొన్నారు.

కామర్స్ గ్రాడ్యుయేట్లకు అనేక అవకాశాలు



కార్యక్రమంలో పాల్గొన్న ప్రొ. చెన్నప్ప తదితరులు

రసూల్‌పురా: పారిశ్రామిక, విదేశీ, స్వదేశీ వర్తకం, బ్యాంకింగ్, రవాణా బీమా, క్యాపిటల్ మార్కెట్లు, మ్యూచువల్ ఫండ్స్, ఇతర ఆర్థిక సంస్థల్లో కామర్స్ గ్రాడ్యుయేట్లకు కెరీర్ పరంగా అవకాశాలుంటాయని తెలంగాణ కామర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, కామర్స్ విభాగాధిపతి ప్రొ. డి చెన్నప్ప పేర్కొన్నారు. సికింద్రాబాద్ పీజీ కళాశాల కామర్స్ విభాగం ఆధ్వర్యంలో ప్రేరణ–2024 కార్యక్రమం బుధవారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన చెన్నప్ప మాట్లాడుతూ కామర్స్ విద్యార్థులకు భవిష్యత్‌లో ఎన్నో అవకాశాలు ఉన్నాయని చిన్న చిట్‌ఫండ్ కంపెనీ నుంచి మల్టీ నేషనల్ కంపెనీల వరకు అకౌంట్ రాయడానికి కామర్స్ గ్రాడ్యుయేట్లు అవసరమని అన్నారు. తెలంగాణ కామర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ, పీజీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొ. రవికుమార్ అధిపతులు పాల్గొన్నారు.

సందడి చేసిన విద్యార్థులు



వేడుకల్లో కళాశాల మ్యాగజైన్‌ను ఆవిష్కరిస్తున్న కిషోర్‌బాబు



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

ఘనంగా రైల్వే డిగ్రీ కళాశాల వార్షికోత్సవం

లాలాపేట: తార్నాకలోని రైల్వే డిగ్రీ కళాశాల 47వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపాల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ పి. కిషోర్‌బాబు ముఖ్యతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే డిగ్రీ కళాశాల విద్యార్థులు ఇటీవల కాలంలో విద్యలోనే కాకుండా క్రీడా సాంస్కృతిక రంగాల్లో జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని తెలిపారు. ఇదే కళాశాలకు చెందిన విద్యార్థి ఇటీవల జాతీయ స్థాయిలో కబడ్డీ పోటీల్లో గోల్డ్‌మెడల్‌ను సాధించిన విషయాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. త్వరలో కళాశాల ఆవరణలో బాస్కెట్ బాల్ కోర్టును ప్రారంభిస్తామని ప్రకటించారు. అనంతరం కళాశాల మ్యాగజైన్ ఉదయిని' ఆవిష్కరించారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు గోల్డ్ మెడల్స్, క్యాష్ అవార్డులు, మెరిట్ సర్టిఫికేట్లు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. భాష్యం కళాశాల వార్షిక నివేధికను సమర్పించారు. డా. కాశీనాథ్, రామశాస్త్రి పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఎస్సీ వర్గీకరణ అంశం చివరిదశకు చేరుకుంది



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు గోవింద్ నరేష్ మాదిగ

బన్సీలాల్‌పేట్: ఎస్సీ వర్గీకరణే మాదిగల రాజకీయ ఎజెండా అని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవింద్ నరేష్ మాదిగ అన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ డి క్లాస్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ ద్వారానే మాదిగలు, మాదిగ ఉపకులాల్లోని ప్రజలు జీవితాలు బాగుపడుతాయన్నారు. ఉమ్మడి ఎస్సీ రిజర్వేషన్ల వల్ల మాదిగలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఎస్సీ వర్గీకరణ అంశం అంతిమ దశకు చేరుకుందన్నారు. నరేంద్రమోదీ నాయకత్వంలోని బీజేపీ ఎస్సీ వర్గీకరణ సమస్య పరిష్కారానికి చొరవచూపుతున్న నేపథ్యంలో ఆ పార్టీకి మాదిగలు అన్నివిధాలా అండగా ఉండాలన్నారు. కె. సుచంద్రమాదిగ అధ్వర్యంలో జరిగిన ఈ సమావేశం నిర్వహించారు.

ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి



ఫ్లాగ్‌మార్చ్‌లో పాల్గొన్న ఏసీపీ జైపాల్‌రెడ్డి, పోలీస్ అధికారులు

చిలకలగూడ : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేపట్టామని చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి అన్నారు. చిలకలగూడ ఠాణా పరిధిలో బుధవారం నిర్వహించిన సాయుధ బలగాల కవాతుతో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. నగర కొత్వాల్ శ్రీనివాసరెడ్డి, ఈస్ట్‌జోన్ డీసీపీ గిరిధర్ ఆదేశాల మేరకు శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించినట్లు తెలిపారు. చిలకలగూడ మున్సిపల్ మైదానం వద్ద ప్రారంభమైన సాయుధ కవాతు సీతాఫల్‌మండి, నామాలగుండు, వారాసిగూడ చౌరస్తా, కౌసర్‌మసీదు మీదుగా కొనసాగింది. కార్యక్రమంలో చిలకలగూడ, వారాసిగూడ, లాలాగూడ సీఐలు అనుదీప్, సైదులు, పద్మ, డీఐ రమేష్‌గౌడ్, ఎస్ఐలు జ్ఞానేశ్వర్, బాలరాజు, కిషోర్, సబిత, సుధాకర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

వైభవంగా దోపోత్సవం



మోడల్‌కాలనీలో దోపోత్సవ దృశ్యం

సనత్‌నగర్: ఈఎస్‌ఐ సమీపంలోని శ్రీవిజయలక్ష్మి దేవాలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సనత్‌నగర్ మోడల్‌కాలనీలో బుధవారం సాయంత్రం దోపోత్సవ కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. విజయలక్ష్మి ఆలయం నుంచి స్వామి వారి ఉత్సవ ఊరేగింపుగా సుందర్‌నగర్ మీదుగా మోడల్‌కాలనీకి తీసుకువచ్చారు. కాలనీ మహిళలు దీపాలు, కోలాట ప్రదర్శనలతో స్వామి వారి ఊరేగింపునకు స్వాగతం పలికారు. అనంతరం దేవాలయానికి చెందిన రంగాచార్యుల పర్యవేక్షణలో అర్చక, సిబ్బంది నిర్వహించిన భక్తిపూర్వక నాటక ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. సతీసమేతుడై ఉన్న శ్రీవెంకటేశ్వర స్వామి ఊరేగింపును తిరుమంగైళ్ ఆళ్వార్ నాయకత్వంలోని దోపిడీ దొంగల బృందం అడ్డగించడం, ఆభరణాలతో పరారవ్వడం వంటి సన్నివేశాలను ప్రదర్శించారు. అనంతరం స్థానికుల చేతికి చిక్కిన దొంగ ముఠాకు స్వామివారు ప్రత్యక్షం కావడంతో తిరుమంగైళ్ ఆళ్వార్‌కు కనువిప్పు కలిగి దొంగతనాలకు స్వస్తి చెప్పారు. ఈ దృశ్యాలను భక్తులు కళ్ళార్పకుండా తిలకించారు. ఈ నాటకాన్ని వీక్షించేందుకు మోడల్‌కాలనీ, సుందర్‌నగర్ పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. దోపోత్సవం సందర్భంగా మోడల్‌కాలనీ ప్రతినిధులు జేఎస్‌టీ శాయి, బుచ్చిబాబు, శశికాంత్, వెంకటసుబ్బారావు, పద్మిని, నాగమణి, రాజేశ్వరి, శిల్ప తదితరులు ఏర్పాట్లను చేశారు.

హలీమ్... సలామ్..

రంజాన్ నందర్భంగా జోరందుకున్న హలీమ్ విక్రయాలు

చిలకలగూడ : పవిత్ర రంజాన్ మాసంలో మాత్రమే లభించే హలీం విక్రయాలు ఊపందుకున్నాయి. చిలకలగూడ ప్రధాన రహదారిలోని తాత్కాలిక విక్రయ కేంద్రాల వద్ద బారులు తీరిన ప్రజలు హలీం రుచులను ఆస్వాదిస్తున్నారు. చిలకలగూడ, బౌద్ధనగర్, వారాసిగూడ, మైలార్‌గడ్డ, పార్శిగుట్ట, మహ్మద్‌గూడ, సీతాఫల్‌మండి, షాబాద్‌గూడ తదితర 40 ప్రాంతాలకు చెందిన వేలాది మంది ముస్లిం సోదరులు అతి ప్రాచీనమైన చిలకలగూడ బడే మసీదులో ప్రతిరోజు ప్రార్ధనలు నిర్వహిస్తుంటారు. వీరి సౌకర్యార్థం చిలకలగూడ నుంచి వారాసిగూడ వెళ్లే ప్రధాన రహదారిలో పలువురు నిర్వాహకులు హలీం విక్రయ కేంద్రాలను అందుబాటులోకి తెచ్చి, రంగురంగుల విద్యుత్ దీపాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. మటన్, చికెన్, వెజ్ హలీంలు అందుబాటులో ఉన్నప్పటికీ మటన్ హలీంకే డిమాండ్ ఎక్కువగా ఉందని నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 12 గంటల వరకు హలీంను విక్రయాలు కొనసాగుతాయని, పార్సిల్స్ ద్వారా ఎక్కువ అమ్మకాలు జరుగుతున్నాయని తెలిపారు.

35 ఏళ్లుగా హలీం విక్రయాలు

– సర్దార్ భాయ్, ఎవర్‌గ్రీన్ హోటల్ నిర్వాహకుడు



మూడున్నర దశాబ్దాలుగా హలీం విక్రయాలు నిర్వహిస్తున్నానని సీతాఫల్‌మండి మైలార్‌గడ్డ ఎవర్‌గ్రీన్ హోటల్ నిర్వాహకుడు సర్దార్‌బాయ్ తెలిపారు. అప్పట్లో ప్లేట్ హలీం ధర రూ.15 ఉండగా, ఇప్పుడు రూ.260 అయిందన్నారు. మేలు రకమైన మటన్, బాదం, జీడిపప్పు, గోధుమరవ్వ, నెయ్యితోపాటు ఇంట్లో తయారు చేసిన మసాలా దినుసులను హలీంలో వినియోగిస్తానని వివరించారు.

సుదర్శన హోమం



సనత్‌నగర్: శ్రీమదలర్మేల్ మంగా, పద్మావతి సమేత శ్రీకళ్యాణ వెంకటేశ్వర స్వామి వార్ల 27వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం సుదర్శన హోమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అశేష భక్త జనుల మధ్య వేద మంత్రోచ్చారణలతో పండితులు హోమం జరిపించారు. ఈఓ శ్రీనివాసరాజు పర్యవేక్షణలో ప్రధాన అర్చకులు రవీంద్రాచార్యుల బృంద సభ్యులచే బ్రహ్మోత్సవాలను ఘనంగా జరుపుతున్నారు. అలాగే గురువారం ఉదయం 9 గంటలకు చతుస్థానార్చనలు, మూలమంత్రం హోమములు, మహాపూర్ణాహుతి, కొట్నాలు, అప్పగింతలు, వసంతోత్సవం, చక్రస్నానం జరుగుతుందని ఈఓ శ్రీనివాసరాజు తెలిపారు. సాయంత్రం విష్ణు సహస్రనామ పారాయణం, ధ్వజారోహణ, మూగబలి, ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవ, పండిత సన్మానం, మహాదాశీర్వచనంతో శ్రీవారి బ్రహ్మోత్సవాలు ముగిస్తాయని వివరించారు.

భక్తిశ్రద్ధలతో సువార్త స్వస్థత సభలు



సువార్త స్వస్థత సభలో ప్రసంగిస్తున్న పాస్టర్లు జెబ్‌రాజ్, జాయ్‌లు

చిలకలగూడ : హోసన్నా పెంతెకోస్తు ఫెయిత్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో చిలకలగూడ మున్సిపల్ మైదానంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న సువార్త స్వస్థత సభలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. హెచ్‌పీఎఫ్ఎమ్ నిర్వాహకుడు పాస్టర్ జాయ్ నేతృత్వంలో జరుగుతున్న స్వస్థత సభల్లో పాస్టర్లు జెబ్‌రాజ్, మాథ్యూస్, జాన్‌వెస్లీ, చార్లెస్ జాకబ్‌లు ముఖ్య అతిథులుగా హాజరై క్రీస్తు బోధనలతోపాటు పలు అంశాలపై ప్రసంగించారు. ఏసు క్రీస్తును స్తుతిస్తూ నిర్వహించిన సంగీత విభావరి, చిన్నారుల నృత్యరూపకాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. బుధవారం జరిగిన సువార్త కార్యక్రమంలో గుంటూరు కృప మినిస్ట్రీస్ పాస్టర్ బ్రదర్ మాథ్యూస్, హోసన్న మినిస్ట్రీస్ పాస్టర్ జాన్ వెస్లీలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి దేవుని వాక్యం వినిపించారు.

గిరిజన వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఠానూనాయక్ వర్ధంతి సభలో నివాళులు అర్పిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞానకేంద్రం: ఠానూనాయక్ స్ఫూర్తితో గిరిజన వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలని సేవాలాల్ సేన రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్యా సంజీవ్ నాయక్ పిలుపునిచ్చారు. బుధవారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఠానూనాయక్ 74వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సంజీవ్‌నాయక్ మాట్లాడుతూ రాజ్యాంగంలోని గిరిజన హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ భంగ్యా భూక్యా మాట్లాడుతూ భూమి, భుక్తి, వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ పోరాటం దేశానికి ఆదర్శమన్నారు. గిరిజన సంఘం ప్రధానకార్యదర్శి ఆర్.శ్రీరామ్‌నాయక్ మాట్లాడుతూ గిరిజనుల హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గిరిజన సంఘం అధ్యక్షుడు ధర్మానాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాందాస్‌నాయక్, రాజునాయక్, ప్రొఫెసర్ శంకర్, రాజేష్‌నాయక్, అశోక్ రాథోడ్, కళ్యాణ్ పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ల సమస్యలను విస్మరించిన ప్రభుత్వం

బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్



సమావేశంలో మాట్లాడుతగున్న రాంబాబుయాదవ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఆటోడ్రైవర్ల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, వారి ఆత్మహత్యలను ఆపకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని భారత్ రాష్ట్ర ట్రేడ్ యూనియన్(బీఆర్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు జి.రాంబాబుయాదవ్, ప్రధాన కార్యదర్శి వేముల మారయ్య, కనీస వేతనాల సలహామండలి పూర్వ చైర్మన్ పి.నారాయణ హెచ్చరించారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని బీఆర్‌టీయూ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 18న రమేష్ అనే ఆటో డ్రైవర్ మలకపేట్‌లో ఆత్మహత్య చేసుకున్నారని, ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత రాష్ట్రవ్యాప్తంగా 40 మంది మరణించారని, ఉచిత బస్సుల వల్ల ఆటోడ్రైవర్లకు వ్యాపారం తగ్గిపోయిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం జోక్యం చేసుకొని ఆటోడ్రైవర్ల ఆకలిచావులు ఆపాల్సిన అవసరం ఉందన్నారు. ఆటోడ్రైవర్ల కుటుంబాలకు నెలకు కనీసం రూ.15 వేల ఇవ్వాలని కోరారు.

కేన్సర్‌పై అవగాహన అవసరం

డీబీఆర్ మిల్స్ హెల్త్ సెంటర్ ఉచిత వైద్యశిబిరంలో ఎంపీ డాక్టర్ లక్ష్మణ్



కవాడిగూడ: కేన్సర్ మహమ్మారిపట్ల ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. కేన్సర్‌ను మొదటి దశలోనే గుర్తిస్తే పూర్తిగా తగ్గించవచ్చని, ఇందుకోసం ఆధునిక వైద్యచికిత్సలు దేశంలో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. బుధవారం కవాడిగూడ డివిజన్ లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డీబీఆర్ మిల్స్ హెల్త్ సెంటర్‌లో లయన్స్ క్లబ్ (ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రి) తరంగిణి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో కేన్సర్ స్క్రీనింగ్ ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 45 మంది మహిళలు వైద్యపరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ కేన్సర్ మహమ్మారిని ముందుగానే గుర్తించి వైద్యుల సలహా మేరకు మందులు వాడితే పూర్తిగా నయమవుతుందన్నారు. కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ మాట్లాడుతూ కేన్సర్ మహమ్మారి పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు లయన్స్ క్లబ్, ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రి, తరంగిణి వంటి ఎన్‌జీవోస్ సంస్థలు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఫ్యామిలీ కౌన్సెలర్ హిప్నో పద్మాకమలాకర్, డీబీఆర్ మిల్స్ హెల్త్ సెంటర్ డాక్టర్ అవంతి, డాక్టర్ నళినితోపాటు పలువురు డాక్టర్లు, బీజేపీ రాష్ట్ర నాయకులు జి.వెంకటేష్, డివిజన్ అధ్యక్షకార్యదర్శులు ఎం.సి.మహేందర్‌బాబు, ఎ.ప్రభాకర్ గంగపుత్ర, హెల్త్ సెంటర్ సిబ్బంది మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఈటలకు పలువురి జన్మదిన శుభాకాంక్షలు



రసూల్‌పురా: బీజేపీ మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ జన్మదినం సందర్భంగా కంటోన్మెంట్ బీజేపీ నాయకులు ఈటలను కలసి శుభాకాంక్షలు తెలిపారు. కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యులు జే. రామకృష్ణ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ. పరశురాం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓయూ భూముల రక్షణకు కడియం రాజు పోరాటం మరవలేం



కడియం రాజుకు నివాళులర్పిస్తున్న నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ: కబ్జాదారుల నుంచి కోట్ల విలువ చేసే ఓయూ భూములను పరిరక్షించడంతో దివంగత ఏబీవీపీ నాయకుడు కడియం రాజు చేసిన పోరాటాలు మరువలేనివని పలువురు వక్త పేర్కొన్నారు. బుధవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ 133వ తరగతి గదిలో కడియం రాజు ప్రథమ వర్ధంతి సభ జరిగింది. కార్యక్రమానికి ఓయూ అధ్యాపకులు డాక్టర్ రామకృష్ణ అధ్యక్షత వహించగా బీజేపీ సీనియర్ నాయకులు రామచందర్‌రావు, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు, ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షులు జానకి రెడ్డి, కార్యదర్శి జాన్సీ, మాజీ నాయకులు మురళిమనోహర్, గుంత లక్ష్మన్, నిరంజన్, నరేందర్‌రెడ్డి, కడియం రాజు సతీమణి సాగరికా, రవికుమార్, ప్రేమ్, కళ్యాణ్, రావుల కృష్ణ, వీరీబాబు, కొండ నాగేశ్వర్‌రావు, కోట రాజేష్, శ్రీహరి, జీవన్, ఎల్లస్వామి, శ్రీకాంత్ తదితరులు పాల్గొని కడియం రాజుతో గల అనుబంధాలను ఆయన సేవలను కొనియాడారు.